రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త





ఒక విజయం మరో విజయానికి నాంది కావాలి

చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి

2

# ప్యాచ్ వర్క్ జంతర్ మంతర్

పరిగి-మహబూబ్‌నగర్ రహదారి పనుల తీరుపై విమర్శలు

గ్రావెల్ లేకుండా మట్టిపైనే తారు వేసేస్తున్నారని మండిపాటు



తూతూ మాంత్రంగా పనుల దృశ్యం

**కుల్కచర్ల, డిసెంబరు 20, ప్రభాతవార్త :** ప్రభుత్వాలు రహదారుల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. అధికారుల ఉదాసీనత కారణంగా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు గాలికొదిలేస్తున్నారు. మొక్కుబడిగా చేస్తున్న పనులు మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి. పరిగి-మహబూబ్‌నగర్ రోడ్డుకు తాజాగా చేస్తున్న ప్యాచ్ వర్క్ పనులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి. ఈ మార్గంలో భారీ గుంతలు ఏర్పడి రాకపోకలు తీవ్ర అవరోధంగా మారుతోంది. తరుచు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
అయితే తాత్కాలిక మరమ్మతులను ఆర్అండ్‌బి అధికా రులు చేట్టారు. దీంతో గుడ్డిలో మెల్ల అన్న చందంగా ఎంతోకొంత రహదారి మెరుగుపడుతుందని స్థానికులు ఆనందించారు. తీరా కాంట్రాక్టర్ నిర్వహిస్తున్న పనుల తీరు చూస్తే విస్మయం కలుగుతోందని పలువురు మండిపడుతున్నారు. నిబంధనల ప్రకారం గ్రావెల్‌ను ప్రమాణాల ప్రకారం రెడిమిక్స్‌తో కలిపి తీసుకు రావాల్సి ఉంది. అయితే రోడ్డు పక్కనే మట్టితోనే గుంతలు పూడుస్తున్నారు. దానిపైనే తారు వేస్తుండటంతో ఎంతకాలం ఉంటుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీని వలన ప్రజాధనం వృథా అవ్వడం మినహా ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.
ఉన్నతాధికారులు దృష్టిసారించి పనులు నాణ్యంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సంక్రాంతి తర్వాత బైపాస్ షురూ..

రూ.108 కోట్లకు పొడిగింపు

నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే

రైతులకు రూ.30 కోట్ల పరిహారం

పనులు పునఃప్రారంభిస్తున్నాం: ఆర్అండ్‌బి డిఈ



నిధుల మంజూరులో జాప్యంతో నిలిచిపోయిన తాండూరు బైపాస్ రోడ్డు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తాండూరు బైపాస్ రోడ్డుకు మళ్లీ కదలిక వచ్చింది. పదేండ్లుగా సాగుతున్న పనులు పలుమార్లు ఆగిపోయాయి. పూర్తిస్థాయి నిధులు మంజూరు కాకపోవడం, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందకపోవడం వంటి కారణాల వల్ల బ్రేకులు పడ్డాయి. అయితే, ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి చొరవ తీసుకుని ఫైలుకు కదలిక తెచ్చారు. గతంలో రూపొందించిన అంచనాలను పొడగిస్తూ నిధులు మంజూరు చేయించారు. అప్పట్లో రూ.78 కోట్ల నిధులు మంజూరు చేయగా, ప్రస్తుతం దాన్ని రూ.108 కోట్లకు పొడగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. త్వరలో పనులు పునః ప్రారంభించనున్నారు. అంతకు ముందుగానే రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించనున్నారు.
తాండూరు నుంచి హైదరాబాద్, మహబూబ్‌నగర్, చించోలి, సంగారెడ్డి, జహీరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరం నుంచి మళ్లిస్తూ బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూపకల్పన చేశారు. 2014లో రవాణాశాఖ మంత్రి పీ.మహేం దర్‌రెడ్డి చొరవతో బైపాస్ రోడ్డు మంజూరు చేశారు. అప్పట్లో రూ.78 కోట్లు మంజూరు చేయడంతో పనులు వేగమంతంగా సాగాయి. గౌతాపూర్ నుంచి అంతారం మీదుగా కోటపల్లి రోడ్డుకు, అక్కడి నుంచి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు వద్ద గల హైదరాబాద్ మార్గానికి, కొడంగల్ రోడ్డు నుంచి కోకట్ మీదుగా క్యాంప్ ఆఫీసు వరకు బైపాస్ రూపకల్పన చేశారు. మొత్తం 12 కిలోమీటర్ల మేరకు నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు కోసం 100 ఎకరాల రైతుల భూములను సేకరించారు. అందులో కొన్ని భూములు అసైన్డ్ కూడా ఉన్నాయి. రూ.35 కోట్ల పనులు పూర్తి చేశారు. రైతులకు రూ.20 కోట్ల వరకు పరిహారం చెల్లించారు. ఇంకా 25 కోట్ల రూపాయల వరకు రైతులకు చెల్లించాల్సి ఉన్నది. ఈ క్రమంలో పనులు నిలిచిపోయాయి. పలుచోట్ల రైతుల నుంచి అభ్యంతరాలు రావడంతో పనులు ముందుకు సాగలేకపోయాయి. 2018లో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కూడా బైపాస్ పూర్తి చేసేందుకు కసరత్తులు చేశారు. కొంత వరకు పనులు సాగినా రైతులకు చెల్లింపులు బ్రేకులు పడ్డాయి.
2023లో గెలుపొందిన తర్వాత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బైపాస్ నిర్మాణం కోసం ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. గతంలో మంజూరు చేసిన రూ.78 కోట్లు సరిపోవని తేల్చారు. అప్పటి నిధులతో సింహభాగం రోడ్డు నిర్మాణానికి, రైతుల పరిహారానికి సరిపోయాయి. మిగిలిన వున్న నిధులతో బైపాస్ పూర్తి చేయడం కష్టమని స్పష్టం చేశారు. దాంతో పాత అంచనాల కంటే అదనంగా రూ.30 కోట్లను పెంచుతూ రూ.108 కోట్ల మంజూరు పొందారు. ఎమ్మెల్యే కృషి ఫలితంగా అక్టోబరు నెలలో జీవో కూడా జారీ చేశారు.
సంక్రాంతి తర్వాత బైపాస్ పనులు పునః ప్రారంభిస్తామని ఆర్అండ్‌బీ డీఈ శ్రవణ్‌కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం 2 కిలోమీటర్లు మినహాయించి వికారాబాద్ రహదారి మొదటి లేయర్ పనులు పూర్తి చేశామన్నారు. బాగాయిపల్లి నుంచి కోకట్ రోడ్డు పనులు కూడా చకాచకా చేపడుతున్నామని తెలిపారు. కరణ్‌కోట, సంగారెడ్డి రహదారుల పనులు ఈ నెలాఖరు కల్లా పూర్తి చేసి సంక్రాంతి నుంచి బైపాస్ పనుల చేపడతామని వివరించారు. ముందుకు రైతుల పరిహారం పూర్తి చేసి రహదారులు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కోకట్ వద్ద రైల్వే బ్రిడ్జీ కూడా అనుమతులు ఉన్నాయని చెప్పారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ ఛైర్‌పర్సన్ మంజుల

# రంగ..రంగ!

రంగనాథ స్వామి ఆలయంలో రచ్చరచ్చ

నిధుల వినియోగంపై పరస్పర ఆరోపణలు

నిన్నటి వరకూ కమిటీ పాలకవర్గాన్ని తప్పుపట్టిన ఈవో, అర్చకులు

తప్పంతా ఈవోదేనంటూ రోడ్డెక్కిన కమిటీ ఛైర్‌పర్సన్

దాతల విరాళాలను సొంతానికి వాడేస్తున్నారని ఆరోపణ

అభివృద్ధి పనులకూ సహకరించటంలేదని ధ్వజం

చర్యలు తీసుకునే వరకూ ఆందోళన చేస్తూనే ఉంటామని హెచ్చరిక

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** శ్రీ రంగనాథ స్వామి దేవాలయ ఆదాయ వ్యయాలపై ఈవో భాగ్యలక్ష్మి ఎలాంటి లెక్కలు చూపించడం లేదని ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ నర్రీ మంజుల ఆరోపించారు. ఆలయ ఆవరణలో శనివారం ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ మంజుల తన సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పోచారం సర్కిల్ యంనంపేట్ శ్రీ రంగనాథ దేవాలయంలో జరుగుతున్న అవినీతిపై దేవాదాయ కమిటీ సభ్యులు, మరోవైపు ఆలయ ఈవో మధ్యన తలెత్తిన వివాదం చిలికిచిలికి గాలివానగా మారింది. ఇరువర్గాలు దేవాలయ నిధుల వినియోగం తీరుపై పరస్పర ఆరోపణలు చేసుకుంటున్న నేపథ్యంలో ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ మంజుల శనివారం మీడియా ముందుకు వచ్చారు. ఈవో భాగ్యలక్ష్మి పాలక వర్గానికి సహకరించకుండా తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తాము పదవులు పొందినప్పటి నుండి ఆలయానికి వచ్చే ఆదాయం, ఖర్చులు చెప్పకుండా దాటవేస్తున్నారన్నారు. గత మే నెలలో జరిగిన స్వామివారి బ్రహోత్సవాల ఆదాయ వ్యయాలు ఇంతవరకూ చెప్పలేదన్నారు. ఆలయంలో భక్తులకు

మిగతా 4లో

# ఎందుకిలా జరిగింది?



మొగలిగిద్ద గ్రామం వచ్చిన సిఎంను సత్కరిస్తున్న స్థానిక కాంగ్రెస్ పెద్దలు (ఫైల్)

చేతులారా చెయ్యి కాల్చుకున్నామా!

సిఎం వచ్చినా.. ప్రగతి వెలుగులు తెచ్చినా.. అభ్యర్థి ఎంపిక లోపమే కారణమా..?

మొగలిగిద్దలో ఓటమిపై కాంగ్రెస్ పెద్దల అంతర్మధనం

నియోజకవర్గంలో అతిపెద్ద గ్రామాన్ని కోల్పోయిన కాంగ్రెస్..

ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి ప్రచారం చేసినా కనిపించని ఫలితం!

**షాద్‌నగర్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామానికి వచ్చారు.. గ్రామస్తులు ఎప్పటినుంచో అడుగుతున్నవన్నీ ఇచ్చారు.. ఎమ్మెల్యే వెళ్లారు.. ఇంటింటి ప్రచారం చేశారు.. అయినా అక్కడ వారికి చేదు అనుభవమే ఎదురయింది.. నియోజక వర్గంలోని అతిపెద్ద గ్రామం, చరిత్ర కలిగిన పల్లె.. వారి చెయ్యి దాటిపోయింది. ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో కాంగ్రెస్ పరిస్థితి. సర్పంచ్ అభ్యర్థి ఎంపిక విషయంలో జరిగిన పొరపాటు ద్వారా చేతులారా 'చెయ్యి' కాల్చుకున్నారు అనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని చారిత్రాత్మక గ్రామంగా పేరుగాంచిన గ్రామంలో కాంగ్రెస్ పరాభవంతో ఆ పార్టీ పెద్దలు అంతర్మధనంలో పడ్డారు.

**చేతిలో చెయ్యేసి..**

ఫరూక్‌నగర్ మండలం మొగలిగిద్ద గ్రామానికి చాలా పెద్ద చరిత్ర ఉంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొట్టమొదటి ప్రభుత్వ పాఠశాల ఇక్కడే ఏర్పాటయింది. నియోజకవర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్న ఒకే ఒక గ్రామం మొగిలిగిద్ద. గతంలో ఇక్కడ పోలీస్ స్టేషన్ కూడా ఉండేది. ఐదువేలకు పైగా జనాభా ఉన్న అతిపెద్ద గ్రామం మొగిలిగిద్ద. ఏ ఎన్నికల్లోనైనా ఈ గ్రామాన్ని నాయకులు కీలకంగా భావిస్తారు. ఆ దృష్టితోనే గతంలో ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపుమేరకు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో ఈ గ్రామాన్ని స్వయంగా సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామానికి వరాల పంట పండించారు. ఈ గ్రామాభివృద్ధి కోసం ఏకంగా 63 కోట్లు మంజూరు చేశారు. ఇందులో భాగంగా 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఇక్కడికి ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం, రూ. ఐదు కోట్లతో సిసి రోడ్లు, రూ. 10 కోట్లతో పాఠశాల భవనం, రూ. 25 లక్షలతో హెల్త్ కేర్ సెంటర్, రూ. 50 లక్షలతో మైనారిటీ షాదీఖానా, రూ. 50 లక్షలతో జూనియర్ కళాశాల భవన నిర్మాణం, అదేవిధంగా తెలంగాణకే తలమానికంగా రూ. 45 లక్షలతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు కోసం సీఎం నిధులు వెచ్చించారు. ఆయన స్వయంగా గ్రామాన్ని సందర్శించారు. గ్రామాభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తారని పెద్ద సభ పెట్టి మరి హామీ ఇచ్చారు. అయితే ఇంత ఖర్చు చేసిన, ఇంత హడావిడి చేసిన సాక్షాత్తు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గ్రామానికి వచ్చి ఇంటింటి ప్రచారం చేసినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ విజయం సాధించలేకపోయింది. మొగలిగిద్ద గ్రామాన్ని అంజయ్య యాదవ్ దత్తత తీసుకున్నాడని దత్తపుత్రుడు ఏమి చేయలేదని అనేక విమర్శలు కూడా గుప్పించారు అయినా ప్రజలు విశ్వసించలేదు. ఇక్కడ కాంగ్రెస్ ఓటమికి కారణాలను ఒక్కసారి అన్వేషించినట్లయితే..

**షాదిఖానా నిర్మాణంలో జాప్యం!**

3500 పైచిలుకు ఓట్లు కలిగిన మొగిలిగిద్ద గ్రామాన్ని అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. చరిత్ర కలిగిన అతిపెద్ద ఈ గ్రామాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు కృషి చేశాయి. అయితే అధికార పార్టీకి ఎక్కువ అవకాశాలు ఉన్నా ఇక్కడ మాత్రం బీఆర్ఎస్ 800 పైచిలుకు భారీ మెజారిటీ సాధించింది. దీనికి కారణాలు అన్వేషించినట్లయితే మైనారిటీలు ఎక్కువగా ఉన్న ఈ గ్రామంలో షాదిఖానా నిర్మాణం విషయంలో జాప్యం జరగడం ఆ వర్గాన్ని దూరం చేసింది. అదేవిధంగా ఓ మైనార్టీ యువ నాయకుడిపై కరపత్రాలు ముద్రించి పోలింగ్ ముందు రోజు కాంగ్రెస్ మద్దతుదారుడు అంబటి రాజుకు సంబంధించిన వారు దుష్ప్రచారం చేయడం కూడా మైనార్టీ వర్గాల్లో కాంగ్రెస్‌కు ఓట్లు పడకుండా చేసింది. ఇక ముఖ్యంగా అంబటి రాజు తీరుపై కూడా ఓటర్లలో సంతృప్తి లేదు. ఎమ్మెల్యేతో ఏమైనా పని ఉంటే ఆయన అంబటి రాజుతో కలిసి రమ్మని చెప్పడం, అంబటి రాజు దగ్గరికి వెళితే ఆయన దగ్గరికి రానీయకపోవడంతో ప్రజల్లో ఒక రకమైన ఆగ్రహం ఉంది. అతనితో పాటు పోటీలో ఉన్న తౌడు వెంకటేశం ఒకవేళ రంగంలో ఉండి ఉంటే ఫలితం వేరేగా ఉండి ఉండేదని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి ప్రచారం చేసిన, దత్తపుత్రుడు అని చెప్పి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గ్రామానికి ఎలాంటి సేవలు చేయలేదని విమర్శలు చేసిన, ముఖ్యమంత్రి ద్వారా తాము తెచ్చిన 63 కోట్ల నిధుల గురించి చెప్పిన జనంలో స్పందన కనిపించలేదు. అంబటి రాజును పార్టీ నాయకులు విశ్వసించలేదు. అభ్యర్థి ఎంపిక మొదలుకొని, మంజూరైన పనులను వేగంగా పూర్తి చేసేదాకా కాంగ్రెస్ పార్టీ చేసిన నిరక్ష ్యంల్ల ఈ పరాజయానికి కారణమని స్పష్టమవుతుంది. ఇక్కడ ప్రజల మనసుల్లో ఏముందో తెలుసుకోకుండా ముందుకు వెళ్లిన కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యమే చెల్లించింది. అభివృద్ధికి కోటాను కోట్లు ఇస్తే.. మొగలిగిద్ద ప్రజలు కాంగ్రెస్ పరువు తీశారు. దీంతో గ్రామంలో చేపట్టి పోయే అభివృద్ధి పనులపై కూడా నీలి నీడలు అలుముకున్నాయి. అసెంబ్లీ పరిధిలోని అతిపెద్ద గ్రామాన్ని దూరం చేసుకుంది. భవిష్యత్తులో కూడా ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేయాల్సిన అవసరం ఉంది. త్వరలోనే జరిగే ప్రాదేశిక ఎన్నికల్లో కూడా ఇలాంటి తప్పు నిర్ణయాలు తీసుకుంటే మరోసారి చేతులు కాల్చుకునే అవకాశం ఉంటుంది.

స్థానిక సంస్థల ఎన్నికలలో

# మెజార్టీ సాధిస్తాం

బూత్ స్థాయి నుంచి పార్టీ మరింత బలోపేతం

సంక్షేమాన్ని చూసే ప్రజలు పట్టం కట్టారు

వికారాబాద్ డిసిసి అధ్యక్షులు ధారాసింగ్





మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు దారాసింగ్

**పెద్దేముల్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని వికారాబాద్ డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ అన్నారు. శనివారం తాండూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ధారాసింగ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో వికారాబాద్ జిల్లాలో 594 సర్పంచ్ స్థానాలకు గాను 400 పై చిలుకు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుందని అన్నారు. ముఖ్యంగా సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియాగాంధి, రాహుల్‌గాంధి, ఎఐసిసి పరిశీలకులు మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌లు అందరిని ఒకే తాటిపై తీసుకొచ్చి 6 గ్యారేంటీలను తుచ తప్పకుండా అమలు చేశామన్నారు. రుణమాఫీ ఉచితబస్సు ప్రయాణం, రేషన్‌కార్డులు, సన్నబియ్యం తదితర వాటిని అమలు చేసి సంక్షేమంలో తెలంగాణ ప్రజాప్రభుత్వం నెంబర్‌వన్ స్థానంలో ఉందని అన్నారు. బూత్‌స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్‌ను బలోపేతం చేయడమే తమ ముఖ్య కర్తవ్యమని అన్నారు. కాంగ్రెస్ కులమత భేధాలకు తావులేకుండా పరిపాలన చేస్తే, బిజేపి ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చుపెడుతు పాలన సాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సోనియాగాంధి, రాహుల్‌గాంధి పేరిట ఉన్న హెరాల్డ్ కేసును కోర్టు కొట్టి వేయడం బిజేపికి చెంప పెట్టులాంటిదని అన్నారు. ప్రతి కుటుంబానికి రూ. 15 లక్షలు, కోటి ఉద్యోగాలు ఇస్తానన్న బిజేపి ప్రభుత్వం ఎందుకు మాట నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. అదానికి, అంబానికి బిజెపి వత్తాసు పలుకుతు రైల్వేలను, సిమెంటు పరిశ్రమలను ప్రేవేటికరణ చేస్తుండటం సిగ్గుచేటని అన్నారు. ప్రతి పేదవానికి గ్రామంలోనే పని కల్పించాలనే ఉద్దేశ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం యంజిఎన్ఆర్‌జీఎస్ పథకాన్ని ప్రవేశపెడితే, అట్టి స్కీంను బిజేపి ప్రభుత్వం తీసివేసి ఇతర పేరు పెట్టడం దారుణమని అన్నారు. స్వాతంత్రం కోసం

మిగతా 4లో

# ఓవర్ లోడ్ వేస్తే బెండు తీస్తారా?

జనవరిలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు

కలెక్టర్ ఛైర్మన్‌గా, ఆర్అండ్‌బి అధికారి కన్వీనర్‌గా ఏర్పాట్లు

హెల్మెట్ బైక్ ర్యాలీలు, వాకథాన్ పరుగులు..

రంగోలి ముగ్గుల పోటీలు, రోడ్డు భద్రత ప్రతిజ్ఞలు

ప్రజాచైతన్యానికి ముమ్మర సన్నాహాలు

పరిమితికి మించి లోడు ఉన్న వాహనాలపై మరింత కఠిన చర్యలకు ప్రభుత్వం ఆదేశం



చేవెళ్ల వద్ద బస్సు ప్రమాదానికి కారణమైన కంకర లోడు లారీ (ఫైల్ ఫొటో)

**రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించి మరణాల రేటును నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యంగా ఈ ఏడాది జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాలకు ఓవర్ లోడే కారణమని నిర్ధారించింది. ఈ నేపథ్యంలో వాహనాల దూకుడుకు కళ్లెం వేయడంతోపాటు ఓవర్ లోడ్‌పై మరింత కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం సంబంధిత శాఖాధికారులను ఆదేశించింది. మరోవైపు వచ్చే ఏడాది జనవరిలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించటం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపటానికి కసరత్తు చేస్తోంది. గత సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 25,934 రోడ్డు ప్రమాదాలు జరగగా, 7,949 నరప్రాణాలు కోల్పోయారు. ఇక రంగారెడ్డి జిల్లా పరిధిలో ఈ ఏడాది చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలు పెను విషాదాన్ని నింపాయి. చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ-ఖానాపూర్ మార్గంలో ఆర్‌టిసి బస్సును కంకర లోడుతో వెళుతున్న టిప్పర్ ఢీ కొట్టిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందగా, 20 మంది వరకూ గాయపడ్డారు. టిప్పర్ ఓవర్ లోడే ప్రధాన కారణమని నిర్ధారించారు. ఈ ఏడాది సెప్టెంబరులో కందుకూరు వద్ద జరిగిన లారీ ఆటో ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురు మృతి చెందగా 8మంది గాయపడ్డారు. జూన్‌లో యాచారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా..పలువురు గాయపడ్డారు.. ఇలా అనేక ప్రాంతాలలో నిత్యం రహదరులు రక్తసిక్తమవుతునే ఉన్నాయి. ఈవిధమైన ప్రమాదాలకు ప్రధాన కారణం రోడ్డు నిబంధనలు ఉల్లంఘించటం, రాష్ డ్రైవింగ్, డ్రైవర్ నిరక్ష్యమేనని పోలీసులు గుర్తించారు. ప్రమాదాలను నివారించడానికి రోడ్డు నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరించటానికి, రోడ్డు నిబంధనలపై ప్రజలకు చైతన్యం కల్పించటానికి అధికారులు సన్నాహాలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రోడ్డు సేఫ్టీపై ప్రతి జిల్లాలోని రోడ్ సేఫ్టీ కమిటీలు ఈ నెలాఖరులోపు సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌లకు ఆదేశాలు అందాయి. కలెక్టర్ ఛైర్మన్‌గా ఆర్ అండ్ బి అధికారి కన్వీనర్‌గా ఉంటారు. ఇందులో రవాణా శాఖ, ఆర్టీసీ, విద్యాశాఖ అధికారులు, పోలీస్, ట్రాఫిక్, ఇతర విభాగాల

మిగతా 4లో

# సంగయ్యకు మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



సంగయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**కోట్‌పల్లి, డిసెంబరు, 20, ప్రభాతవార్త;** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలో అర్ధరాత్రి దుండగుల దాడిలో తీవ్రంగా గాయపడిన కోట్‌పల్లి నూతన సర్పంచు బసమ్మ భర్త సంగయ్య ను హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. వైద్యులతో ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. మెరుగైన వైద్యం అందించే విధంగా చూడాలని సూచించారు. అనంతరం దాడికి గల కారణాలు స్థానిక నాయకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిని త్వరలోనే గుర్తించి కఠినంగా శిక్ష పడే విధంగా చూడాలని పోలీసు అధికారులతో మాట్లాడటం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. అయన వెంట వికారాబాద్ డిసిసి అధ్యక్షు లు ధారసింగ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు అనంద్ ఆసుపత్రిలో పరామర్శించారు. సంగయ్యపై దాడి చేసిన ఎంతటి వారినైనా వారిని వెంటనే పోలీసులు గుర్తించి అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు,

## యాప్ బుకింగ్‌తో నాణ్యమైన యూరియా

**మొయినాబాద్ ,డిసెంబరు 20, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సౌలభ్యం కోసం ఎరువుల పంపిణీలో పారదర్శకత పెంపొందించే లక్ష్యంతో ఫర్టిలైజర్ బుకింగ్ మొబైల్ యాప్ ద్వారా యూరియా ఎరువుల బుకింగ్ సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. ఈనెల 22 నుంచి ప్రయోగాత్మకంగా అమల్లోకి రానున్నట్లు మండల వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. శనివారం మండల ప్రాంగణంలో రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ డిజిటల్ యాప్ ద్వారా ఉన్నటువంటి ఉపయోగాలను తెలిపారు. స్మార్ట్ ఫోన్ ద్వారా ఇంటి నుంచే యూరియా ఎరువులను బుక్ చేసుకోవచ్చన్నారు. మొబైల్ నంబర్, ఓటిపి ఆధారంగా లాగిన్ అయి పట్టాదారు పాస్‌బుక్ నంబర్ నమోదుచేయాలని చెప్పారు. పంట రకం, సాగు విస్తీర్ణం ఆధారంగా అర్హత కలిగిన యూరియా బ్యాగుల సంఖ్యను యాప్ చూపిస్తుందన్నారు. ఈ యాప్ ద్వారా బుకింగ్ చేస్తే నకిలీ యూరియా, బ్లాక్ మార్కెటింగ్, డీలర్ షాప్‌ల వద్ద క్యూ లైన్లు వంటి సమస్యలు ఉండవని వివరించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా సమీప రైతు సేవా కేంద్రం లేదా వ్యవసాయ విస్తరణ అధికారుల సహాయం తీసుకోవచ్చని తెలిపారు. ప్రతి రైతు ఈ డిజిటల్ యూరియా బుకింగ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యాక్రమంలో ఏఈవోలు కుమార్, సునీల్‌కుమార్, రైతులు తధితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్వెట్టర్లు పంపిణీ



కరీంగూడలో పంపిణీ చేస్తున్న దృశ్యం

**కీసర, డిసెంబరు20, ప్రభాతవార్త :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని కరీంగూడ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం ఎఫ్ఏటిఈ టీం ఆర్గనైజేషన్ ఆద్వర్యంలో స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ జమదగ్ని మాట్లాడుతూ ఎఫ్ఏటిఈ ఆర్గనైజేషనన చిన్న సంస్థ అయినా పెద్ద మనసుతో చక్కటి కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు చలికాలంలో ఉపయోగపడే విదంగా స్వెటర్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మంజుల,ప్రధానోపాద్యాయులు శ్రీధర్,ఉపాద్యాయులు సుధాకర్, లాస్య, మాజీ ఉపసర్పంచ్ మాధవరెడ్డి,హరిప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజేషన్ సభ్యులు సభ్యులు హర్ష,శ్రీ కౌశిత, రిశ్వంత్, సిద్దార్ద్, శరణ్య, దీప్తి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

## బాల్యవివాహాలతో అనర్ధాలు తెలుసుకోండి

**దోమ, డిసెంబరు20, ప్రభాతవార్త :** ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగపిల్లలకు 21 సంవత్సరలు నిండిన తరువాత వివాహాలు చేయాలని వికారాబాద్‌జిల్లా లీగల్‌సర్వీసెస్ అథారిటీ అదికారి వెంటేశ్ అన్నారు.శనివారం నాడు దోమ మండల కేంద్రములోని ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు బాలకార్మికులు,పోక్సో చట్టం, బాల్య వివాహ ముక్తభారత్ అవగాహన కార్యక్రమము నిర్వహించారు. వికారాబాద్ జిల్లాలోనిబాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో బాల్యవివాహముక్తుభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆడవారికి 18 నిండక ముందు వివాహం చేస్తె భవవిష్యత్తులో గర్బకోశవ్యాదుల బారిన పడిశారిరకంగా ఇబ్బందులు పడుతారనిఅన్నారు.బాల్యవివాహాలు చేయడం చట్టరిత్యా నేరంఅని,వారికిప్రోత్సహించిన వారుకూడ నేరస్తులుగా గుర్తించడము జరుగుతుందని తెలిపారు.చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్1098 ఉపయోగం,సైబర్ నేరాలపై అప్రమత్తత మిషన్,వాత్సల్యపథకం, పోక్సో చట్టం,బేటిబచావోబేటిపడావో,లింగసమానత్వం,సుకన్యసమృద్ధి పథకం,తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర సేవలకోసం 1930,తోపాటు 100 డైల్ హెల్ప్‌లైన్ వంటి కాల్‌సెంటర్‌ల గురించి, వివరించారు.యువతియువకులకు ఉపాది అవకాశాలు పెంపోందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దోమ మండల విద్యాదికారి వెంకట్,చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ రాజునాయక్,ఐసిడిఎస్ సిబ్బంది శ్రీకాంత్,నరుసమ్మ,సఖి సెంటర్ సిబ్బంది సుమలత,మహిళాసాదికారత కేంద్రబృందం ,ప్రదానోపాద్యాయులు ఆంజనేయులు,విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించడం జరిగింది.

## 25న చేగూర్‌లో మహా పడిపూజ

**నందిగామ, డిసెంబరు 20, ప్రభాతవార్త :**నందిగామ మండలంలోని చేగూరు గ్రామం చెరుకు సర్వోత్తమ్ రెడ్డి ఫామ్ హౌస్ లో ఈ నెల 25 వ తేదీన సాయంత్రం 7 గంటలకు మహా పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మికవేత్త చెరుకు సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా శనివారం అయ్యప్ప దేవాలయంలో గురుస్వామి గిరీష్ నాయర్‌ను ఆహ్వానిస్తూ మొదటి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న అయ్యప్ప భక్తులు, పుర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింటూ, నవపేట్ శేఖర్, పబ్బె శేఖర్ తదితరులు ఉన్నారు.



గురు స్వామి గిరీష్ నాయర్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న సర్వోత్తమ్ రెడ్డి

## అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదం

**నందిగామ, డిసెంబరు 20, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం త్రిబుల్ ఆర్ బ్రదర్స్ పూజలు చేశారు. ఈ సందర్భంగా నందిగామ మాజీ సింగిల్విండో చైర్మన్ రేగొండ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ హరిహర పుత్రుడు అయ్యప్ప ఆశీర్వాదంతో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని భగవంతుని వేడుకున్నారు. అనంతరం స్వాములకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ పూజల్లో సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు దామోదర్ రెడ్డి, చంద్రపాల్ రెడ్డి,ఆర్ రఘునందన్ రెడ్డి, ఆర్ రమేష్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్ , నరేందర్ రెడ్డి, అగ్గి సూరి, బొమ్మ గల్లా నర్సింలు ఉన్నారు.



అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న త్రిబుల్ ఆర్ బ్రదర్స్.

# శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

### నూతన సర్పంచుల హామీ..



ఇన్స్‌పెక్టర్ నర్సయ్యను సన్మానిస్తున్న నూతన సర్పంచ్‌లు

**కొత్తూర్, డిసెంబరు 20, ప్రభాతవార్త;** కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్, మక్తగూడ, మల్లాపూర్ తండాలకు చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచులు చిట్టేడి నరసింహారెడ్డి, బోకుల శ్రీరాములు, మీనాక్షి దశరథ్ నాయక్ లు శుక్రవారం కొత్తూరు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నర్సయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సంద ర్భంగా నూతన సర్పంచులు మాట్లా డుతూ, తమ తమ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ప్రశాంత వాతా వరణం నెలకొల్పడంలో ప్రజాప్రతినిధులు, పోలీస్ శాఖ సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఇన్స్పెక్టర్ నర్సయ్య మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, గ్రామాల అభివృద్ధికి శాంతియుత వాతావరణం కీలకమని అన్నారు. నూతన సర్పంచుల సహకారంతో శాంతి భద్రతలను మరింత పటిష్టం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి నాయక్,ఉప సర్పంచ్లు రాములు గౌడ్, శంకర్ నాయక్,వార్డ్ సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి సహకరిస్తా

### పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి

**చౌడపూర్ , డిసెంబరు 20, ప్రభాతవార్త :** పరిగి నియోజకవర్గంలో గెలిచిన సర్పంచులకు అండగా ఉంటూ, గ్రామపంచాయతీల అభివృద్ధికి సహకరిస్తానని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు.శనివారం చౌడపూర్ మండల పరిధిలోని వీరాపూర్ గ్రామ నూతన సర్పంచుగా ఎన్నుకోబడిన కె.మధుసూధన్ రెడ్డి, వార్డుమెంబర్లతో కలిసి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని సన్మానించారు.. వీరపూర్ గ్రామపంచాయతీలో 460 కి పైగా మెజార్టీ పొంది సర్పంచ్ గా విజయం సాధించిన మధుసూదన్ రెడ్డిని అభినందించారు. సర్పంచులకు అండగా ఉంటానని గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధి పనులు, ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రయత్నించాలని సర్పంచ్లకు ఎమ్మెల్యే సూచించారు. చౌడపూర్ మండలంలో 6 గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసి, 14 గ్రామపంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేసిన మండల పార్టీ అధ్యక్షుడు అశోక్ కుమార్ ను ఎమ్మెల్యే అభినందించారు. నాయకులు అనంతరెడ్డి, ముజీబ్,బీమయ్య,ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసిన షాబాద్ మండల నూతన సర్పంచులు

## నమ్మకాన్ని నిలబెట్టుకోండి

**షాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధికి సర్పంచులదే కీలక పాత్ర అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డిలు అన్నారు. షాబాద్ మండల పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గెలిచిన సర్పంచ్, వార్డ్ మెంబర్ లతో కలిసి గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ లను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా గెలిచిన సర్పంచులకు వారు శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామ సమస్యలు పరిష్కరించేందుకు ప్రజలు ఎంతో నమ్మకంతో సర్పంచ్లుగా మిమ్మల్ని ఎన్నుకున్న ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకూడదన్నారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైతాబాద్ సర్పంచ్ కర్రోల్ల శాంతమ్మ యాదయ్య, అంతారం గ్రామ సర్పంచ్ ఈగ ప్రభాకర్ రెడ్డి, కేసారం గ్రామ సర్పంచ్ సుభాష్, పోతుగల్ గ్రామ సర్పంచ్ పామెన నరసింహులు, నాగర్ గూడ గ్రామ సర్పంచ్ స్వరూప మహేందర్ గౌడ్, మాజీ సర్పంచ్లు ఎండీ ఖజామియా పటేల్, రవీందర్ నాయక్, ఆంజనేయులు, పి ఎస్ సి ఎస్ మాజీ చైర్మన్ రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి జహంగీర్, రషీద్ పటేల్, అత్తిలి శ్రీనివాస్ రెడ్డి, చంద్రారెడ్డి, అశోక్, శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, చాగంటి శ్రీనివాస్, కుమ్మరి బాలయ్య, రహమత్ ఖాన్, కావలి శ్రీరాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లకు అండగా ఉంటాం

**షాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** నూతనంగా గెలుపొందిన గ్రామపంచాయతీ సర్పంచులకు అండగా ఉంటామని సర్పంచులు గ్రామ అభివృద్ధి పై దృష్టి పెట్టాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. షాబాద్ మండల పరిధిలోని నూతనంగా గెలుపొందిన పోతుగల్ గ్రామ సర్పంచ్ పామెన నర్సింహులు శనివారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్ రెడ్డిని నగరంలో ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం సర్పంచ్ లకు అండగా ఉంటుందని, గ్రామ అభివృద్ధి పై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జాకీర్ షరీఫ్, పామేనా భార్గవ్ రామ్, రాజు గౌడ్, శ్రీనివాసులు, పిరాంపల్లి యాదయ్య, రవి నాయక్, తదితరులు ఉన్నారు.



పోతుగల్ సర్పంచ్ నర్సింహులను అభినందిస్తున్న మధుసూదన్ రెడ్డి

# సూత్రాలు తెలిస్తే గణితం సులభం



జిల్లా పోటీ పరీక్షలకు అర్హత సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**షాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** సూత్రాలు తెలిస్తే గణితం చాలా సులభమని మండల విద్యాధికారి లక్ష్మణ్నాయక్ అన్నారు. శనివారం షాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో జెడ్ పి హెచ్ ఎస్ హైతాబాద్(ఇంగ్లీష్) విద్యార్థి కె చైతన్య, జెడ్పిహెచ్ఎస్ సర్దార్ నగర్(ఇంగ్లీష్) విద్యార్థి కె వర్షిత, జెడ్పిహెచ్ఎస్ షాబాద్(ఇంగ్లీష్) బాలుర విద్యార్థి పి శివానంద్, జెడ్పిహెచ్ఎస్ (తెలుగు) సర్దార్ నగర్ విద్యార్థి కె అక్షిత, జెడ్ పి హెచ్ ఎస్ సర్దార్ నగర్ (తెలుగు) విద్యార్థి సి హారిణి, జెడ్ పి హెచ్ ఎస్ షాబాద్ బాలికల(తెలుగు) విద్యార్థి ఇ దీక్షయ విద్యార్థులు పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పరీక్షల్లో గెలిచిన విద్యార్థులు ఈనెల 30న జిల్లా స్థాయి పరీక్షకు అర్హత సాధిస్తారని అన్నారు. అన్ని సబ్జెక్టుల కన్నా గణితం చాలా సులభమని, విద్యార్థులు గణితంలోని సూత్రాలను తెలుసుకుంటే సులభంగా రాణించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలరాజు, ఉపాధ్యాయులు సుశీల, కృష్ణ, టీఎంఎస్ మండల అధ్యక్షుడు ఆనంతరెడ్డి, కార్యదర్శి జయరాజ్, కోశాధికారి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గణితా ప్రతిభాపాటవ పరీక్షలో ప్రతిభ పత్రాలు అందజేస్తున్న ఎంఇఓ మల్లేశం

## గణితంపై ట్యాలెంట్ టెస్ట్

**మోమిన్‌పేట్. డిసెంబరు 20, ప్రభాతవార్త :** మోమిన్ పేట మండలంలోని వివిధ జిల్లా పరిషత్ పాఠశాలల నుండి విచ్చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు మోమిన్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్నం రెండు 2 నుండి 3 గంటల వరకు మండల స్థాయి గణితా ప్రతిభాపాటవ పరీక్ష నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లేశం, వివిధ పాఠశాలల గణిత ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఈ ప్రతిభాపాటవ పరీక్షలో మొదటి స్థానం ముబీనా జడ్పిహెచ్ఎస్ కొల్కొంద, రెండవ బహుమతి శివ కార్తీక్ జడ్పిహెచ్ఎస్ మేకవనంపల్లి, గోవర్ధన్ లు సంయుక్తంగా అందుకోవడం జరిగిందని తెలిపారు. మండల పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాల విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొనడం జరిగిందని ఆయన అన్నారు. ఇలాంటి పరీక్షలు నిర్వహించడం వలన వారికి భవిష్యత్తులో ఎలాంటి పోటీ ఉంటుందో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల

## జిల్లా స్థాయికి గణిత ఫోరం పోటీలకు ఎంపిక

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబరు 20, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు గణిత ఫోరం జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో గణిత టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసి నట్లు వారు వివరించా రు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చౌదరి గూడకు చెందిన వినయ్ కుమార్, నక్షత్ర, నవీన్ గౌడ్, శ్రీరామ్, పెద్ద ఎల్కిచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన భరత్‌తేజ, శ్రీనివాస్‌లు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు సునీత, ప్రకాష్, సురేష్ కుమార్‌రెడ్డి, లక్ష్మణ్, అసర్లలు అభినందించారు.




విద్యార్థులను అభినందిస్తున్న ఎంపిఒ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు



సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, నిర్మలా ఉపెందర్ రెడ్డి తదితరులు

## సర్పంచ్ నిర్మలకు బిజెపి తీర్థం

**మోమిన్‌పేట్. డిసెంబరు 20, ప్రభాతవార్త :** మోమిన్‌పేట్ మండల పరిధిలోని మల్లారెడ్డిగూడెం గ్రామంలో నూతన సర్పంచ్ గా విజయం సాధించిన నిర్మలా ఉపెందర్ రెడ్డి శనివారం బిజెపి అసెంబ్లీ కో-ఆర్డినేటర్ వడ్ల నందు ఆద్వర్యంలో బిజెపి కండువా కప్పి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వడ్ల నందు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రతి పథకం, ప్రతి పని కూడా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. నూతన సర్పంచ్ లు భాజాపా పార్టీలో చేరి కండువా వేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉపెందర్ రెడ్డి తో పాటు ఆ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆహా..ఏమి రుచిరా!

### పాఠశాలలో చిన్నారుల చేతి వంట

**మోమిన్‌పేట్. డిసెంబరు 20, ప్రభాతవార్త :** ఫుడ్ ఫేస్ట్ కార్యక్రమం నిర్వహించడంలో విద్యార్థులు పాల్గొని భోజనం వడ్డించి వారి ప్రతిభ చాటుకున్నారని మోమిన్ పేట్ మండల విద్యాశాఖాధికారి మల్లేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ, ఫుడ్ ఫేస్ట్ గురించి విధ్యార్థులకు అవగాహన కలుగుతుందని అన్నారు. అలాగే విద్యార్థుల ఇందులో భాగంగా ఆహారం యొక్క ప్రాధాన్యత మరియు వివిధ ఆహార పదార్థాలలో ఉండే పోషక పదార్థాల ు గురించి విద్యార్థులకు వివరించడం జరిగిందని అన్నారు. విద్యార్థులు వివిధ రకాల పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల ు ప్రదర్శించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. తల్లిదండ్రులు కూడా పాల్గొని వారి ప్రతిభ ు గుర్తించి, ఇలాంటి అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులు ఫుడ్ ఫేస్ట్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లేశంతో పాటు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణాదేవి, ఉపాధ్యాయులు అ ంరాధ, జ్యోతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



ఫుడ్ ఫేస్ట్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యాధికారి మల్లేశం

రైతు సేవా సహకార సంఘం అధికారిగా...

## బాధ్యతలు చేపడుతున్న ఆనంద్ రావు

**మేడ్చల్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** మేడ్చల్ మేడ్చల్ మండలంలోని పూడూరు గ్రామంలో గల రైతు సేవా సహకార సంఘం ప్రత్యేక అధికారిగా ఆర్ ఎమ్ వీ ఆనంద్ రావు బాధ్యతలు స్వీకరించారు సంఘం పాలకవర్గ పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అందులో భాగంగా పూడూరు సంఘానికి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను ప్రత్యేక అధికారిగా నియమించడంతో ఆయన శనివారం సంఘం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు .ఈ కార్యక్రమంలో సంఘం సిబ్బంది పాల్గొన్నారు.



## పిహెచ్‌సి ప్రత్యేక అధికారిగా ఈశ్వరయ్య

**కీసర,డిసెంబరు 20, ప్రభాతవార్త :** కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక అధికారిగా మేడ్చల్ జిల్లా సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్టర్‌గా బాధ్యతలు నిర్వ హిస్తున్న కడుపొల్ల ఈశ్వరయ్యను ప్రభుత్వం కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక అధికారిగా నియమించబడ్డారు.శనివారం మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సం ఘం కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సహకార సొసైటీ మాజీ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి,సెక్రటరీ వినయ్ తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు తీసుకుంటున్న ఈశ్వరయ్య

## ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

..బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్

**పెద్దేముల్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** ప్రజలతో మమేకమై వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చూడాలని తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట తారకరామరావు అన్నారు. శనివారం హైద్రాబాద్‌లో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అధ్వర్యంలో పెద్దేముల్ గ్రామ నూతన సర్పంచ్ డివై నర్సిములు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్‌లు కేటిఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేటిఆర్ కూడా వారినిసన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటిఆర్ మాట్లాడుతూ గ్రామంలోని మౌళిక సదుపాయల కోసం సర్పంచ్ పంచాయతీ పాలకవర్గంతో కలిసి కృషిచేయాలని అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కేటిఆర్‌ను కలిసిన వారిలో మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు రుక్మాపూర్ రమేష్ తదితరులు ఉన్నారు.



కేటిఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే, సర్పంచ్ తదితరులు

## గుండె పోటుతో లారీ డ్రైవర్ మృతి

**నందిగామ, డిసెంబరు 20, ప్రభాతవార్త :**నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో జాలు(36) లారీ డ్రైవర్ గుండెపోటుతో చెందారని మృతి గ్రామస్తులు తెలిపారు. ఇన్ముల్ నర్వ శివారులో పి ఎన్ జి పరిశ్రమ నుండి హైదరాబాద్ వైపు బయలుదేరిన జాలు మార్గమధ్యలో రంగాపూర్ కు చేరుకోగానే అతని బాడీ సహకరించలేదు. పక్కన లారీని నిలిపి వైద్య చికిత్స కోసం రంగపూర్ లో ఉన్న ఓ క్లినిక్ వద్దకు వచ్చాడు. డాక్టర్ కనిపించకపోవడంతో ఫోన్ చేశాడని, ఆ సమయంలో తన గదిలో టిఫిన్ చేస్తున్నట్లుగా అక్కడున్న వారు చెబుతున్నారు. డాక్టర్ వచ్చేలోగా కుప్పకూలి పడి ఉండగా స్ట్రోక్ వచ్చిందేమో అనుకొని సిపిఆర్ చేసిన ఫలితం కానరాలేదన్నారు. ఈ సంఘటన విషయమై అక్కడే ఉన్న రంగాపూర్ కాంగ్రెస్ సీనియర్ నేత నవపేట్ రవీందర్ గౌడ్, మరికొందరు పోలీసులకు సమాచారం ఇచ్చి, అంబులెన్స్ ను రప్పించి మృత దేహం షాద్నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన విషయమై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.



చౌదర్పల్లి అయ్యప్ప స్వామి సన్నిధానంకు

## అయ్యప్ప విగ్రహం అందజేసిన శ్రీకాంత్ గౌడ్

**తలకొండపల్లి, డిసెంబరు20, ప్రభాత వార్త:** చౌదర్పల్లి గ్రామం తలకొండపల్లి మండలం అయ్యప్ప స్వామి సన్నిధానానికి జూలపల్లి గ్రామ వాస్తవ్యులు మోనిక శ్రీకాంత్ గౌడ్ దంపతులు, జహంగీర్ గురు స్వామికి ఇచ్చిన మాట ప్రకారం అభిషేక అయ్యప్ప విగ్రహం ఇవ్వడం జరిగింది. అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ప్రతి సంవత్సరం ఒక అయ్యప్ప సన్నిధానానికి అయ్యప్ప విగ్రహం ఇప్పించి తనకు హిందూ ధర్మం పట్ల, దైవ భక్తి పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకుంటానని తెలియజేస్తూ ఆ అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆశిస్తూ గత సంవత్సరం మొదటగా వెల్జాల్ గ్రామ అయ్యప్పస్వామి దానంతో ప్రారంభించిన విగ్రహ ప్రదానం ప్రతి ఏటా కొనసాగుతుందని వచ్చే సంవత్సరం అంతారం గ్రామ అయ్యప్ప సన్నిధానానికి ఇస్తానని చెప్పి స్వాముల ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది.కార్యక్రమంలో శంకర్ గురు స్వామి, శరత్ స్వామి, ప్రదీప్ స్వామి, రామ్ రెడ్డి స్వామి ,చంద్రశేఖర్ స్వామి ,ఎన్టీఆర్ స్వామి, యాదగిరి స్వామి, మదన చారి స్వామి, ప్రశాంత్ స్వామి ,బిట్టు స్వామి పాల్గొనడం జరిగింది.

## అధైర్య పడొద్దు అండగా ఉంటా..

### ఓటమి రేపటి గెలుపుకు నాంది

..రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్,తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్...



**తలకొండపల్లి, డిసెంబరు20, ప్రభాత వార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా దుద్దు పావని కృష్ణయ్య,పోటీచేసి స్వల్ప ఓట్ల(15)తేడాతో ఓటమిపాలయ్యారు.ఈ సందర్భంగా గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ చంద్రయ్య,మాజీ ఎంపీటీసీ మాదుగుల రామస్వామి,మాజీ వార్డు సభ్యులు తూర్పు శ్రీను,కాశే శేఖర్,కార్యకర్తలు ఈరోజు రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్,తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ను హైదరాబాదులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ..స్వల్ప ఓట్ల తేడాతో సర్పంచిగా ఓడిపోవడం బాధాకరమని ,ఓటమి నుండి బయటపడి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామంలో గులాబీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు సూచించారు.అధైర్య పడొద్దని ఎప్పుడూ ఏ ఆపద వచ్చినా తాను కార్యకర్తలకు అండగా ఉండి కాపాడుకుంటానని భరోసానిచ్చారు.అనంతరం పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వార్డు సభ్యులు తూర్పు శివలక్ష్మి శ్రీను,తిరు మణి శేఖర్,దుద్దు మల్లమ్మలను శాలువాతో సన్మానించి అభి నందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండె రవీందర్ రెడ్డి, జంగారు శివ రాజా,సొంటె రమేష్,జాజాల రాఘవేందర్,కాశే శ్యాంసుందర్,దుద్దు స్వామి,దుద్దు మల్లయ్య పాల్గొన్నారు.

## నిరుపేదలకు నిత్యావసర సరుకులు,దుప్పట్లు, పంపిణీ

### సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి

**తలకొండపల్లి, డిసెంబరు20, ప్రభాత వార్త:** రంగారెడ్డి జిల్లా తలకొండ పల్లి మండలం ..పడకల్ గ్రామంలో జయ ఫౌండేషన్ సొసైటీ, ఎన్ఆర్ఐ తెలుగు అసోసియేషన్ , గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్‌రెడ్డితో కలిసి గ్రామంలో 100మంది నిరుపేదలకు నిత్యవసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ..గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మా గ్రామం లో జయ ఫౌండేషన్ వారు నిరుపేదల దృష్టిలో పెట్టుకొని నిత్యవసర సరుకులు దుప్పట్లు పంపిణీ చేయడం ఒక శుభపరిణామం జయ ఫౌండేషన్ వారు ప్రతి గ్రామంలో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ లట్టుపల్లి రాజ్ కుమార్ రెడ్డి, వార్డు సభ్యులు జనిగే నరసమ్మ, బురిగెళ్ళ రాధికా రమేష్, లట్టుపల్లి వసంత రంగారెడ్డి, ఎం.డి.వాజిద్, గ్రామస్తులు,నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రునికి భరోసానిచ్చిన తోటి మిత్రులు

**కేశంపేట, డిసెంబరు20, ప్రభాత వార్త:** బాల్య మిత్రుడికి ఆర్థిక సహాయాన్ని అందించి అండగా మేమున్నామని తోటి మిత్రులు భరోసానిచ్చారు. కేశంపేట మండల పరిధిలోని పోమల్‌పల్లి గ్రామంలో 2006 , 2007లో ఏడవ తరగతి వరకు కలిసి చదువు కున్న తోటి మిత్రుడు వడ్ల మహేష్ గతకొన్నిరోజులు గా అనారోగ్యంతో బాధ పడుతూ హైదరాబాద్లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాల్యమిత్రుడు ఆపదలో ఉన్న పరిస్థితిని తెలుసు కున్న తోటి మిత్రులు శనివారం ఆసుపత్రికి వెళ్లి మిత్రుడు మహేష్ ని పరామర్శించి మనోధైర్యం అందించి, ఆ భగవంతుడి ఆశీస్సులతో నువ్వు త్వరగా కోలుకుంటావని, నీకు ఎలాంటి కష్టం వచ్చినా అధైర్యపడవద్దని నీకు అన్ని విధాల మేమున్నామని భరోసానిస్తూ ఖర్చుల నిమిత్తం రూ.34 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు రాజు యాదవ్, కంచుకోట సురేష్, నర్సింలు మహారాజ్, చాకలి శేఖర్, చాకలి కృష్ణ తోటి మిత్రులు పాల్గొన్నారు.



బాల్యమిత్రుడిని పరామర్శిస్తున్న స్నేహితులు



మాట్లాడుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**కొడంగల్, డిసెంబరు20, ప్రభాత వార్త:** పోక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రాంతికుమార్ అన్నారు.శనివారం మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినిలతో వంటకాలను తయారు చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడి అంటే చదవడం,రాయడం,మానిసికోల్లాసానికి ఆటలు ఆడుకోవడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని,వీటన్నింటితో పాటు పిల్లలకు ఆర్మీలో మాదిరిగా అన్ని రంగాల్లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.మంచి ఆహారపు అలవాట్లు మనిషి జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాయో తదితర అంశాలపై వివరించారు.అనంతరం విద్యార్థినిలు తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంధ్యతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సర్కారు స్కూల్లో ఇంగ్లీష్ లెర్నింగ్ డ్రైవ్

**శంకర్‌పల్లి, డిసెంబరు20, ప్రభాత వార్త:** చదువు ఆనందంగా ఉంటేనే అది నిజమైన మార్పును తీసుకువస్తుందనే నమ్మకంతో, దిజూదీ మరియు క్లబ్ ఐనా సభ్యులు క్లబ్ ఇన్ఫినిటీ, క్లబ్ అనలిటిక్స్, స్పీక్ అప్, మరియు నజారియా క్లబ్‌లతో కలిసి కోండకల్ ప్రాంతంలోని ఒక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థుల కోసం ఒక ఇంగ్లీష్ లెర్నింగ్ డ్రైవ్‌ను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి దిజూదీ మరియు క్లబ్ ఐనా నుండి కీర్తన మరియు ఆమె టీమ్, క్లబ్ అనలిటిక్స్ నుండి దేవాంశ్ మరియు అతని టీమ్, స్పీక్ అప్ క్లబ్ నుండి వేళా మరియు అతని టీమ్, అలాగే నజారియా క్లబ్ నుండి నితేష్ మరియు అతని టీమ్, క్లబ్ ఇన్ఫినిటీ మద్దతుతో నాయకత్వం వహించారు. అందరూ కలిసి ఇంగ్లీష్ నేర్చుకోవడం సులభంగా, సరదాగా ఉండేలా చేయాలని లక్ష్యంగా పనిచేశారు.సెషన్ ప్రారంభంలో విద్యార్థులకు ఇంగ్లీష్‌లో తమను తాము పరిచయం చేసుకోవడం నేర్పించారు పేరు, తరగతి, చిన్న వివరాలు చెప్పే విధంగా ప్రోత్సహించారు. అక్షరాలు, సాధారణంగా ఉపయోగించే పదాలు, సులభమైన వాక్యాలు, ఉచ్చారణ, మరియు రోజువారి సంభాషణల్లో ఉపయోగించే మాటలను స్నేహపూర్వకంగా బోధించారు.పాఠశాల వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చేందుకు వర్డ్ ప్లే గేమ్స్, చిత్రాల ఆధారంగా పదాలను గుర్తించే ఆటలు, స్పీకింగ్ సర్కిల్స్, త్వరిత స్పందన ఆటలు వంటి సరదా కార్యకలాపాలను నిర్వ హించారు. ఈ ఆటలు విద్యార్థుల పదజాలాన్ని మెరుగుపరచడమే కాకుండా, ఇంగ్లీష్ మాట్లాడడంపై ఉన్న భయాన్ని కూడా తొలగించాయి. తరగతులు నవ్వులతో, ఉత్సాహంతో




నిండిపోయాయి.పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం మరియు వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. తప్పులు చేయడానికి భయపడకుండా ప్రశ్నలు అడగడానికి, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి వాలంటీర్లు ఒక సురక్షితమైన, ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని కల్పించారు. విద్యార్థుల ముఖాల్లో కనిపించిన ఆనందం ఈ కార్యక్రమం ఎంత ప్రభావవంతంగా జరిగిందో తెలిపింది.ఈ సంయుక్త కార్యక్రమం విద్య ద్వారా సామాజిక మార్పు తీసుకురావడంలో విద్యార్థి సంఘాల పాత్ర ఎంత ముఖ్యమో చాటిచెప్పింది. కోండకల్ ప్రభుత్వ పాఠశాల సందర్శన చిన్న ప్రయత్నాలు కూడా ఒక మంచి ఉద్దేశంతో, కలిసి పనిచేస్తే చిన్న మనసుల్లో దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపగలవని గుర్తు చేసింది.

## వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు20, ప్రభాత వార్త:** రెండు వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు స్థానిక ఎస్సై బి. నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. అన్నోజిగూడ శ్రీ లక్ష్మీనర్సింహ కాలనీకి చెందిన కొనుగూరు నర్సింగ్‌రావు కూమారుడు కె. నూతన్ ప్రసాద్ ( 28 ) నాలుగు సంవత్సరాల క్రితం బైక్ ప్రమాదం చోటుచేసుకోవడంతో తీవ్ర మనస్థాపం చెంది మెంటలీ డిస్టబ్ అయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగడమే గాక యాసిడ్ తాగేవాడు. దీంతో కుటుంబ సభ్యులు వైద్యం చేయించగా ప్రాణభయం తప్పింది. కాగా ఈ నెల 18 వ తేదిన పెద్ద మొత్తంలో యాసిడ్ సేవించడంతో ఆపస్మారకస్థితికి చేరుకుని ఇంట్లో పడిఉండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 19 వ తేది రాత్రి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### యంనంపేట్‌లో...

పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యంనంపేట్‌లో సెక్యూరిటీగార్డుగా పనిచేసే విక్రమ్ కుమార్ సింగ్ ( 30 ) మద్యానికి బానిసైనాడు. గత నెలరోజులుగా మీసాల శ్రీరాములు పొలంలో మృతుడు విక్రమ్ కుమార్ సింగ్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 19వ తేది రాత్రి మద్యం సేవించి నిద్రకు ఉపక్రమించగా 20 వ తేది ఉదయం ఐదున్నర గంటల సమయంలో సహచర సెక్యూరిటీ గార్డు గైక్వాడ్ నాగయ్య లేపేందుకు ఎంత ప్రయత్నించిన విక్రమ్ లేవలేదు. సెక్యూరిటీ గార్డు నాగయ్య పరిక్షించి చూడగా విక్రమ్ కుమార్ చనిపోయి ఉన్నాడు. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుడు జార్ఖండ్ వలసవచ్చి జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు మృతుడి సోదరుడు జితేందర్ సింగ్‌కు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## యూరియా బుకింగ్‌పై అవగాహన

**షాద్‌నగర్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** యూరియా ఫెర్టిలైజర్ బుకింగ్ మొబైల్ యాప్‌పై ఫరూక్నగర్ మండల పరిధిలోని షాద్నగర్ మార్కెట్ యార్డులో షాద్నగర్ సహాయ వ్యవసాయ సంచాలకులు రమాదేవి ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎరువుల దుకాణాల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా, రైతులు తమ ఇంటి నుండి స్మార్ట్ ఫోన్ ద్వారా యూరియాను బుక్ చేసుకోవచ్చని సూచించారు. వచ్చే సోమవారం నుండి రైతులు తప్పనిసరిగా ఈ యొక్క ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారానే యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు. యాప్ లో మొబైల్ నెంబర్ తో ఓటీపి ద్వారా లాగిన్ అవ్వగానే పట్టాదారు పాస్ పుస్తకం నెంబర్ లేదా ఆధార్ నెంబర్ నమోదు చేసిన తర్వాత పంట వివరాలు, విస్తీర్ణం నమోదు చేసి బుక్ చేసుకోవాలని తెలిపారు. బుకింగ్ పూర్తయిన తర్వాత రైతు మొబైల్‌కు ఒక ఐడి వస్తుంది. ఆ ఐడి ని సంబంధిత డీలర్ కు చూపించి నిర్ణీత సమయంలో యూరియా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

## గాంధీజీ పేరు తొలగింపుపై నేడు నిరసన

**చేవెళ్ల, డిసెంబరు 20, ప్రభాతవార్త :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గాంధీజీ పేరును తొలగించినందుకు ఈనెల 21న మొయినాబాద్ మండలం అజిత్ నగర్ లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జుకన్నగారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జి పామేనా భీమ్ భరత్ ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటలకు నిరసన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి కార్యదర్శి చల్ల వంశీచందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్చార్జీలు మాజీ ఎంపీలు హాజరవుతున్నారని తెలిపారు. సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

**ఘట్‌కేసర్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** ఘట్‌కేసర్ ఘణాపూర్‌లో అనారోగ్యంతో



ఆర్థికసాయం అందజేస్తున్న మహేశ్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు

మృతిచెందిన వేముల కిష్టయ్య కుటుంబానికి గౌడ సంఘం నుంచి రూ.5,000లు ఆర్థికసాయం చేశారు. శనివారం కిష్టయ్య కుమారులు ఔషపతి, బిక్షపతి, రవీందర్‌ల కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ నగదును అందజేశారు. ఈకార్యక్రమంలలో మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు వేముల పరమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు వేముల రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మండల రమేశ్‌గౌడ్, డైరక్టర్లు వేముల లలిత భాస్కర్‌గౌడ్, వేముల శంకర్‌గౌడ్, మాజీ అధ్యక్షులు తాటికొండ మల్లేశగౌడ్, వేముల రాములుగౌడ్, వేముల పరమేశ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో మెజార్టీ సాధిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కృషిచేసిన నెహ్రూ కుటుంబంలోని వ్యక్తులను కాకుండా ఆర్ఎస్ఎస్‌లో ఉన్న వారి పేరు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇట్టి విషయంలో రేపు రాబోయే రోజులలో బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇందుకు నిరసనగా ఈ నెల 21న వికారాబాద్‌లో ఉదయం 10,30 ఎన్‌టిఆర్ చౌరాస్త నుంచి మహత్మగాంధి విగ్రహం వరకు కాంగ్రెస్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరుగుతుందని, అందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబీబ్ లాల, మధుసుధన్‌రెడ్డి, హర్షవర్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓవర్ లోడ్ వేస్తే బెండు తీస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు సమన్వయం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి జిల్లాలో రోడ్ భద్రతా ఫోర్స్ వాలంటీర్ బృందాలను ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో, పాఠశాలల్లో అధికారులతో కలిసి ఈ టీం అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. పాఠశాలల్లో రోడ్డు నిబంధనలపై పిల్లలకు అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేస్తున్న చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయడానికి కూడా ప్రభుతం ఏర్పాట్లు చేస్తోంది.

యూనిసెఫ్ సహకారంతో విద్యార్థులకు ట్రాఫిక్ అవేర్నెస్‌పై పాఠ్యాంశాలు బోధించనున్నారు.

కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ చేసుకునేవారికి, డ్రైవింగ్ లైసెన్స్ పొందిన ప్రతివారికి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించనున్నారు. స్క్రాపింగ్ పాలసీ ద్వారా ఫిట్నెస్ లేని వాహనాలపై కొరడా ఝుళిపించనున్నారు.

ప్రమాదాలు జాతీయ రహదారులపైనే అధికంగా అవుతుండడంతో రాత్రి వేళ వాహనాల పార్కింగ్, వాహనాల బ్రేక్ డౌన్ సమయంలో రేడియం రిఫ్లెక్టర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. వాహనదారుల్లో క్రమశిక్షణ పెంచడానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రధాన రహదారుల్లో ప్రధాన నగరాల్లో ఎన్ఫోర్స్మెంట్ చేసి నిబంధాలను ఉల్లగించే వారికి చలానాలు విధించే కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేస్తున్నారు. వాహనదారులు హెల్మెట్‌లు ధరించేలా చేయడం, సీటు బెల్ట్ పెట్టుకునే విధంగా చేయడం, ట్రిపుల్ రైడింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకోవడం చేయడం వల్ల ప్రమాదాలు తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యాష్లెస్ ట్రీట్మెంట్ సమర్థవంతంగా అమలు జరుగుతోంది. దీని ద్వారా బాధితుడికి ఏడు రోజుల్లో రూ.లక్షా 50 వేల వరకు ఉచితంగా అందజేస్తారు. రోడ్డు ప్రమాద బాధితులను తక్షణ సహాయం అందించిన వాహనదారులను ప్రోత్సహించడానికి రహవీర్ గుడ్ సమర్థన్ స్కీమ్ ద్వారా రూ.25 వేల క్యాష్ అవార్డు అందించే పథకం రాష్ట్రంలో త్వరలోనే ప్రారంభించటానికి కూడా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

2026 జనవరిలో జరిగే రోడ్డు భద్రతా మాసోత్సవాలు హెల్మెట్ బైక్ ర్యాలీలు, వాక్ థన్ పరుగులు, రంగోలి ముగ్గుల పోటీలు, రోడ్డు భద్రత ప్రతిజ్ఞలు, ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, మోటార్ సైకిల్ చిన్న హెల్మెట్ స్టిక్కర్ అతికించడం ద్వారా అవగాహన కల్పించడం, కారు విండ్ స్క్రీన్‌కు చిన్న సీట్ బెల్ట్‌ను అతికించడం ద్వారా అవగాహన కల్పించడం, అన్ని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు సమావేశాలు, వ్యాస రచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు, వక్తృత్వ పోటీలు, రోడ్లపై వివిధ బృందాల ద్వారా అవగాహన, ఆడియో విజువల్ మార్గాల ద్వారా అవగాహన, స్థానిక రేడియో మరియు సిటి కేబుల్స్‌లో రోడ్డు భద్రత చర్చలు, సినిమా థియేటర్లలో అవగాహన స్లైడ్‌లు మరియు వీడియోలు, హోర్డింగ్‌ల ద్వారా అవగాహన, కళాకారుల బృందాల చేత అవగాహన ఆర్టీసీ బస్సు కండక్టర్ల ద్వారా కరపత్రాల పంపిణీ, బస్టాండ్లలో హోర్డింగ్‌లు, డిస్‌ప్లేలు మరియు అనౌన్సర్‌ల ద్వారా అవగాహన ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ లకు సూచించారు.

అధికప్రమాదకర కారిడార్లు, బ్లాక్ స్పాట్ లని గుర్తించి వాటిని తొలగించాలి. అవసరమైన చోట ప్రధానంగా రోడ్డు కూడళ్లలో సంకేతాలను ఏర్పాటు చేయాలి.రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఆర్టీఏ మెంబర్లు, నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు వార్డు మెంబర్లు అవగాహన కార్యక్రమంలో పాల్గొనేలా రవాణా శాఖ, పోలీస్, ఆర్టీసీ, ఇతర విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి కింది స్థాయి నుండి రాజధాని వరకు విస్తృత అవగాహన ద్వారానే మరణాల రేటు తగ్గించవచ్చని సంబంధిత ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

## రంగ..రంగ

(మొదటి పేజీ తరువాయి)

తాగునీటి వసతి, మరుగుదొడ్లు నిర్మిద్దామంటే ఈవో సహకరించడం లేదని ఆరోపించారు. పాలకవర్గంతో కలిసి సమావేశం ఏర్పాటు చేయాలని పలుమార్లు చెప్పిన తమ మాట వినిపించుకోవడం లేదన్నారు. ఈవో ఆలయానికి వచ్చే నిధులు, దాతలు విరాళంగా నగదు, ఖర్చుల వివరాలు సభ్యులకు తెలుపకుండా తన ఇష్టానుసారంగా బిల్లులు పెట్టి దేవాలయ నిధులు స్వాహా చేస్తున్నారన్నారు.

ఈ విషయమై పలుమార్లు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, వారు ఆదేశించినా ఇంతవరకు మీటింగ్ ఏర్పాటు చేయలేదని వివరించారు.

భక్తులు విరాళంగా అందజేసే నిధులను ఆలయ సిబ్బంది ఫోన్‌పే ద్వారా తీసుకుని తమ సొంతానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈవోపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకునే వరకు ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ నర్రీ మంజుల, డైరక్టర్లు పి. కాంత్ గౌడ్, పి. పోశెట్టి, ఎస్. నాగార్జున, ఎన్. శ్రీలత, మాజీ ఎంపీటీసీ నర్రీ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## యంనంపేట్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

### జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 20, ప్రభాత వార్త:** పోచారం సర్కిల్ పరిధిలోని పలుచోట్ల అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయని యంనం పేట్‌కు చెందిన బిజెపి నాయకులు జిహెచ్ఎంసి ఎల్‌బి. నగర్ కమిషనర్‌కు శనివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోచారం సర్కిల్ యంనంపేట్‌లోని మల్లిఖార్జున్ ఎన్‌క్లేవ్, శ్రీరామ ఎన్‌క్లేవ్‌లలో అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించలేదని తెలిపారు. ఆయా వెంచర్లలో జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతి పొందేది జి ప్లస్ 2 అయితే నిర్మించేది జి ప్లస్ ఐదు లేదా ఆరు అంతస్తులు నిర్మిస్తూ జిహెచ్ఎంసి ఆదాయానికి గండికొడుతున్నారని బిజెపి రాష్ట్ర నాయకుడు పత్తెపు పాండురాజు జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.




గుర్తింపు కార్డులను చూపిస్తున్న కంకల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు,తదితరులు

## క్రీడా దుస్తులకు ఆర్థికసాయం అందించడం అభినందనీయం

### కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయరాలు పుష్ప

**పూడూరు, డిసెంబరు 20, ప్రభాతవార్త :** విద్యార్థుల క్రీడా దుస్తులకు పేరెంట్స్ ఆర్థికసాయం అందించడం అభినందనీయమని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయరాలు పుష్ప అన్నారు. శనివారం పూడూరు మండలం పరిధిలోని కంకల్ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో టీచర్స్,విద్యార్థుల తల్లి దండ్రుల సమావేశం జరిగింది.అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థికసౌజన్యంతో కొనుగోలు చేసిన క్రీడా దుస్తులు,గుర్తింపు కార్డులు ,టై, బెల్టులను పంపిణీచేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తుందని వివరించారు.క్రీడా దుస్తులు, గుర్తింపు కార్డులు,టై,బెల్టులు ధరించడంవల్ల విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతతోపాటు,క్రమశిక్షణలో మార్పు వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్,ఉపాధ్యాయులు శేఖర్,ఈశ్వర్,శ్రీను, నాయుడు, సతీష్,ఈశ్వర్‌రావు,విద్యార్థుల తల్లిదండ్రులు రాము,సురేష్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షానే నిలుస్తుంది

### నూతన పాలకవర్గం గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి సుదర్శన్ గౌడ్

**కొత్తూర్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు ఎలాంటి భయాలు, నిర్బంధాలు లేకుండా ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్ అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పాలన సాగుతుండటమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. శనివారం నందిగామ మండలం చాకలిదానిగుట్ట తాండలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గబ్రు చౌహాన్, ఉప సర్పంచ్ రవీందర్ నాయక్, వార్డ్ సభ్యులు సుదర్శన్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలుస కున్నారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్‌తో పాటు పాలకవర్గానికి ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించిన సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసి రామ్ నాయక్, కిషన్ నాయక్, చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సుదర్శన్ గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

## టిఎస్‌యుటిఎఫ్ విద్యా సదస్సు క్యాలెండర్ ఆవిష్కరణ

**కొత్తూరు, డిసెంబరు 20, ప్రభాతవార్త;** కొత్తూరు మండల కేంద్రంలో తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా సదస్సు క్యాలెండర్ విడుదల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తూరు ఎంఈఓ అంగూర్ నాయక్, ఇంకా నాయకులు విరమోనీ దేవేందర్ ముదిరాజ్ క్యాలెండర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై ఉపాధ్యాయుల్లో అవగాహన పెంపొందించడం, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి లక్ష్యంగా టిఎస్‌యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా సదస్సు ద్వారా ఉపాధ్యాయుల్లో విద్యా చైతన్యం మరింత పెరుగుతుందని, భవిష్యత్ కార్యాచరణకు ఈ క్యాలెండర్ మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు రఘుపాల్, కొత్తూరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరమోని దేవేందర్, టిఎస్‌యుటిఎఫ్ మండల అధ్యక్షుడు గౌరయ్య, జనరల్ సెక్రటరీ ప్రిన్స్, నాయకులు భాస్కర్ రావు, సాయన్న పలువురు ఉపాధ్యాయులు, టిఎస్‌యుటిఎఫ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విద్యా సదస్సు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ,టిఎస్‌యుటిఎఫ్ సభ్యులు

## మల్లయ్య సేవలు అభినందనీయం

**కొడంగల్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తపస్ జిల్లా గౌరవ అద్యక్షులు బాకారం మల్లయ్యకు ఘనంగా సన్మానించారు. శనివారం బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్ టీపీయూఎస్) జిల్లా సర్వసభ్య సమావేశంలో 2025న26 సంవత్సరానికి గాను తపస్ జిల్లా గౌరవ అద్యక్షులుగా ఎన్నికై సందర్భంగా బాకారం మల్లయ్యని పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం కాశయ్య అద్వర్యంలో పీఆర్‌టీయూ మండల అద్యక్షులు అనిల్‌కుమార్,తపస్ మండల అద్యక్షులు బాకారం చంద్రశేఖర్,యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివరాజ్,పండిత సరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజాజ్ హైమాద్,మండల అద్యక్షులు మాధవరెడ్డి ఉపాధ్యాయ బృంధం శాలువాలు,పూలమాలలతో ఘనంగా సన్మానించారు.మల్లయ్య సేవలను గుర్తించి జిల్లా గౌరవ అద్యక్షులుగా అవకాశం కల్పించినందుకు తపస్ మండల అద్యక్షులు చంద్రశేఖర్ రాష్ట్ర,జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శివరాజ్,గంజు వెంకటయ్య,భవాని,సువీల ,స్రవంతి, రిజ్వాన,శాయేజా,నరసింహులు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తపస్ జిల్లా గౌరవ అద్యక్షుడు మల్లయ్యను సన్మానిస్తున్న దృశ్యం